సాక్షి
బాపట్ల

గురువారం । 10 । జూలై । 2025



సాయినాథుని గ్రామోత్సవం

ముప్పాళ్ళ: గురుపౌర్ణమి సందర్భంగా చాగంటివారి పాలెంలోని ప్రసన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో బుధవారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.



అలరించిన భక్తి సంకీర్తన

నగరంపాలెం: స్థానిక ఆదిత్యనగర్‌లోని సాయిబాబా మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి సంకీర్తన కార్యక్రమం అలరించింది.

శాకంబరిగా పార్వతీ అమ్మవారు



దుగ్గిరాల: గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు బుధవారం శాకంబరిగా భక్తుకుల దర్శనం ఇచ్చారు.

న్యూస్‌రీల్

రేపు వెలగపూడిలో ప్రపంచ జనాభా దినోత్సవం

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



తాడికొండ: ఈనెల 11న తుళ్లూరు మండలం వెలగపూడి సచివాలయం సమీపంలో ప్రపంచ జనాభా దినోత్సవం జరగనుంది. కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించి సభా స్థలి ఏర్పాట్లు, బార్ కోడింగ్, వాహనాల పార్కింగ్, సీటింగ్, తాగునీరు, పారిశుద్ధ్య పనులు తదితర నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. పలు సూచనలు జారీ చేశారు. గుంటూరు ఆర్డీఓ శ్రీనివాసరావు, సీపీఓ శేషశ్రీ, డీపీఓ నాగసాయి కుమార్, పీడీ డ్వామా శంకర్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఎంపీడీఓ శిల్ప, తుళ్లూరు తహసీల్దార్ సుజాత,అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేదవ్యాస ఆరాధన




అమరావతి: ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన వైకుంఠపురం భవఘ్ని ఆరామంలోని వేదవ్యాసాలయంలో గురుపూర్ణిమ మహోత్సవాలలో రెండవరోజు కార్యక్రమాలలో భాగంగా బుధవారం వ్యాస భగవానునికి సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం, వ్యాస ఆరాధన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భవఘ్ని గురూజీ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ సమాజంలో ఆధునికత, నాగరికత పేరుతో మానవాళి చెడు మార్గం పట్టకుండా సన్మార్గంలో నడిపించడానికి వ్యాస భగవానుడు అందించిన భగవద్గీత మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. వేడుకలలో ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన, షుక్ బాపూజీ పద్యనాటకం భక్తులను ఎంతగానో అలరించాయి. భక్తులు పలు జిల్లాల నుంచి భారీగా పాల్గొన్నారు.

జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన సీఈ



విజయపురి సౌత్: నాగార్జునసాగర్ కుడి కాలువ జలవిద్యుత్ కేంద్రాన్ని శ్రీశైలం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ చీఫ్ ఇంజినీర్ జి.తిరుమల ప్రసాద్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. శ్రీశైలం క్రస్ట్ గేట్లు ఎత్తి నాగార్జునసాగర్‌కు నీటి విడుదల జరుగుతుండటంతో కుడి జలవిద్యుత్ కేంద్రంలో పవర్ జనరేషన్‌కు సిద్ధంగా ఉండాలని సూచించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెన్‌కో క్వార్టర్స్‌ను పరిశీలించారు. సీఈ తిరుమల ప్రసాద్‌ను జెన్‌కో అధికారులు ఘనంగా సత్కరించారు. కుడి జలవిద్యుత్ కేంద్రం ఈఈ సీహెచ్ అప్పాజీ, సివిల్ ఎస్ఈ కె.వెంకటరమణ, సివిల్ ఈఈ సుబ్రహ్మణ్యం, 327 యూనియన్ సెక్రటరీ బి.సూరజ్‌చంద్, అధ్యక్షుడు ఎం.సాంబశివ, ఎస్.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అమరేశ్వరుని ఆదాయం రూ.27.09 లక్షలు



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలో వేంచేసియున్న శ్రీబాలచాముండికా సమేత శ్రీ అమరేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నాలుగు నెలలుగా హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. కోటప్పకొండ దేవస్థానం సహాయ కమిషనర్ చంద్రశేఖరరావు పర్యవేక్షణలో దేవాలయంలోని 10 హుండీలను తెరచి అందులో ఉన్న నగదును లెక్కించారు. ఈఓ రేఖ మాట్లాడుతూ హుండీల ద్వారా రూ.26,32,499, అన్నదానం హుండీల ద్వారా రూ.75,596, మొత్తం రూ.27,09,095 వచ్చిందన్నారు.

ఎండుతున్న రైతు గుండె!

సకాలంలో వర్షాలు పడి కాలువలకు సమృద్ధిగా నీరు వస్తే పంట పొలాలు పైర్లతో కళకళలాడుతుండేవి. ఈ ఏడాది ముందుగానే వర్షాలు పడటం, ప్రస్తుతం వరుణుడు మొహం చాటేయటం, ఈదురు గాలులు వీస్తుండటంతో మొలక దశలో ఉన్న నారు మడులు, వెద పెట్టిన పొలాలు మొక్క దశలోనే మాడిపోతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.



పొలానికి నీరు పెట్టేందుకు సమ్మెటవారిపాలెం రైతుల పాట్లు

- ఆదిలోనే తప్పని క'న్నీటి' కష్టాలు
- నీరందక ఎండిపోతున్న నారు మడులు
- డీజిల్ ఇంజిన్లను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- ఎకరం తడిపేందుకు రూ.వేల ఖర్చు
- కాలువల్లో అడుగంటిన సాగునీరు
- ఆందోళనలో మునిగిపోయిన రైతులు

బాపట్ల టౌన్: కళ్లెదుటే రైతుల ఆశలు ఆవిరి అవుతుండటంతో ఆవేదన చెందుతున్నారు. డీజిల్ ఇంజిన్లు, నీటిని పెట్టేందుకు అవసరమైన ట్యూబులు అద్దెకు ఇచ్చే షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికే దుక్కులు, ఎరువులకు రూ.వేలకు వేలు ఖర్చు చేసి నారుమడులు పోసుకున్న రైతులు మొక్క దశలో ఉన్న పైరును కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. సహజంగా రైతులకు నీటి కష్టాలు అక్టోబర్ మాసంలో పైర్లు బిర్రుపొట్ట దశలో ఉన్నప్పుడు తలెత్తేవి. ఒకటి, రెండు తడులు అందిస్తే ఈని నవంబర్, డిసెంబర్ మాసాల్లో కోతలకు వచ్చేవి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఆదిలోనే నీటి కష్టాలు మొదలయ్యాయి. నారు మడుల దశలోనే డీజిల్ ఇంజిన్లపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో తీర ప్రాంతాల్లోని రైతులు సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు.

ఇప్పటికే దాదాపు రూ.పది వేలు ఖర్చు

బాపట్ల జిల్లాలో ఏటా రైతులు నార్లు పోసుకొని, నాట్లు వేసుకునే పద్ధతికే మక్కువ చూపేవారు. ఈ ఏడాది జూన్ మాసంలో వర్షాలు కురవడంతో నారు మడులతోపాటు వెద పద్ధతి వైపు మొగ్గు చూపారు. ప్రస్తుతం మొలకలు వచ్చిన పైర్లు కూడా భూమిలో తేమ లేకపోవడం, భానుడి భగభగతో మాడిపోతున్నాయి. నారు మడులు అయితే పూర్తిగా ఎండిపోతున్నాయి. వెద పద్ధతిలో సాగు చేసిన పొలాలకు విత్తనాల కొనుగోలు, ట్రాక్టర్ల కూలీ, మందుల పిచికారి, దుక్కులు ఇలా అన్నీ కలిపి ఇప్పటికే ఎకరాకు రూ. 10 వేల వరకు ఖర్చు చేశారు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు.

కాలువ నీరు వస్తే మేలు



మాది చీరాల మండలం, గవినివారిపాలెం. కర్లపాలెం మండలం సమ్మెట వారి పాలెం పంచాయతీ పరిధిలో పొలం ఉంది. ఇటీవల కాలువలకు సాగునీరు రావడంతో నారుమడులు సిద్ధం చేసుకొని నారు పోశా. ప్రస్తుతం నీరు రావడం లేదు. కొద్దిపాటి నీటిని కాలువ మొదట్లో ఉన్న రైతులు డీజిల్ ఇంజిన్లతో వాడుతున్నారు. బోరు ద్వారా నీటిని అందించేందుకు పైపులు తీసుకెళ్తున్నా.

– శ్రీనివాసరావు, రైతు, గవినివారిపాలెం

పెరిగిన ఖర్చులతో భారం



పీటీ చానల్ పరిధిలో హైదరపేట – సమ్మెట వారి పాలెం మధ్యలో 3 ఎకరాలు ఉంది. మరో 6 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. నాలుగు రోజుల క్రితం నాట్లు వేసేందుకు నారు విత్తనాలు పోశా. ప్రస్తుతం నారు మొలక దశలో ఉంది. వర్షాలు పడటం లేదు. కాలువల్లో నీరు అడుగంటిపోయింది. డీజిల్ ఇంజిన్‌తో తడులు అందిస్తున్నా. మొత్తం తడపాలంటే రూ. 2,500 నుంచి రూ.3,000 వరకు ఖర్చు అవుతోంది.

– పిట్టు గురవారెడ్డి, శీలంవారిపాలెం

నాలుగు రోజుల్లో కాలువలకు నీరు

ప్రస్తుతానికి మున్సిపాలిటీ చెరువుకు తాగునీటి అవసరాలకు కాలువల నీటిని అందిస్తున్నాం. రెండు రోజులుగా దీనికే సరఫరా చేస్తున్నాం. పీటీ చానల్‌కు నాలుగు రోజుల్లో నీరు విడుదల చేస్తాం. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

- వెంకటరమణ, ఇరిగేషన్ జేఈఈ, బాపట్ల

ఎర్ర జెండాలు కన్నెర్ర

ఎర్ర జెండాలతో చీరాల పట్టణంలో ర్యాలీ తీస్తున్న వివిధ రంగాల కార్మికులు



- కార్మికుల సమ్మె విజయవంతం
- యజమానులకు లాభాలు తెచ్చేందుకే లేబర్ కోడ్స్
- మండిపడిన కార్మిక లోకం

చీరాల: కార్మికులను కట్టు బానిసలుగా మార్చడంతోపాటు కంపెనీల యాజమానులకు అధిక లాభాలను తీసుకొచ్చేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన కార్మిక చట్టాలను రూపొందించాయని ఏపీ ఐఎల్‌టీడీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధనలక్ష్మి పేర్కొన్నారు. దీన్ని ఖండిస్తున్నామని చెప్పారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని తెలిపారు. నూతన కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె చీరాలలో విజయవంతం అయింది. సీఐటీయూ, వైఎస్సార్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ యూనియన్లు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నాయి. కార్మికుల హక్కులను, రక్షణను విస్మరించే చట్టాలను రద్దు చేయాలని కోరుతూ నాయకులు, కార్మికులు ఎర్ర జెండాలతో సమ్మె నిర్వహించారు. ఈ కారణంగా ఐఎల్‌టీడీ కంపెనీ మూతపడింది. కంపెనీ వద్ద జరిగిన ప్రదర్శనలో ఫెడరేషన్ నాయకులు ధనలక్ష్మి మాట్లాడారు. వంద సంవత్సరాల క్రితం సమ్మెలు చేసి కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం సాధించుకున్నారని, ప్రస్తుత చట్టాలు అమల్లోకి వస్తే ఆ చట్టాలన్నీ కోల్పోతారన్నారు. పట్టణంలో వివిధ కార్మిక సంఘాలు, అంగన్‌వాడీ, మెప్మా, మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. భారీ ర్యాలీ చేపట్టారు. సీఐటీయూ నాయకులు వసంత రావు, గోసాల సుధాకర్, పఠాన్ కాలేషా, కె.రామకృష్ణ, బాబ్జి, కాలేషా, ఆనందబాబు, నాగరాజు, వెంకటేశ్వర్లు, పోతురాజు, అమీర్, కార్మికులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

బాపట్ల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో బుధవారం బాపట్లలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పలు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి జీబీసీ రోడ్డు, రథం బజారు ద్వారా అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుంది.ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, ఏఐటీయూసీ నాయకులు సింగరకొండ, కె.శరత్, బి.తిరుమలరెడ్డి, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖ ఎలిజబెత్, గీత, కృష్ణవేణి, రాహేలు, రత్నం, బుచ్చిరాజు హరిబాబు, ఒ.లక్ష్మణ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన చేపట్టిన సీఐటీయూ నాయకులు

కోన ప్రభాకరరావు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కోన రఘుపతి

బాపట్ల: మాజీ గవర్నరుగా, ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర శాసనసభ స్పీకరుగా, రాష్ట్ర ఆర్థిక మంత్రిగా బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గానికి మూడు పర్యాయాలు శాసనసభ్యుడిగా పనిచేసిన దివంగత కోన ప్రభాకర రావు విగ్రహాన్ని తొలగించిన ప్రదేశంలోనే పాత బస్టాండ్ వద్ద డివైడర్‌పై తిరిగి ఏర్పాటు చేయాలని మాజీ శాసనసభ్యులు కోన రఘుపతి కోరారు. బుధవారం స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోన మాట్లాడుతూ.. రాష్ట్రానికి, దేశానికి కోన ప్రభాకర రావు చేసిన సేవలను గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బాపట్ల పట్టణానికి తాగునీరు అందించిన ఘనత కోన ప్రభాకరరావుకే దక్కుతుందన్నారు. ఏ పదవి చేపట్టినా దానికి వన్నె తెచ్చే విధంగా బాధ్యతలు నిర్వహించారన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన సేవలను గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రహదారి విస్తరణలో పాత బస్టాండ్ వద్ద ఉన్న విగ్రహాన్ని తొలగించి తిరిగి ఏర్పాటు చేస్తామని ఆ రోజు తీర్మానం చేశారని గుర్తుచేశారు. ఆ తీర్మానం అమలుకు నోచుకోలేదని, ఆయన జయంతి సందర్భంగానైనా పురపాలక సంఘం అధికారులు విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించాలన్నారు. సుప్రీంకోర్టు సైతం డివైడర్లపై విగ్రహాలు పెట్టుకోవచ్చనే సూచన చేసిందన్నారు. మరి ఎందుకు జాప్యం జరుగుతుందో అర్థం కావడం లేదని తెలిపారు. రహదారి విస్తరణలో తొలగించిన విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేయాలని అడుగుతున్నామని పేర్కొన్నారు. ఇదే తరహాలో ఎన్టీఆర్, పొట్టి శ్రీరాములు, గుర్రం జాషువా విగ్రహాలను తొలగించి మూలన పెట్టేశారన్నారు. వాటిని కూడా తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. గురువారం జరిగే కోన ప్రభాకరరావు జయంతి కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, జోగి రాజా, శ్రీనివాసరెడ్డి, తన్నీరు అంకమ్మరావు తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణకు డ్రోన్ల నిఘా కీలకం

- ఆరు డ్రోన్లను అందించిన దాతలు
- జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ అభినందన



డ్రోన్ల దాతలను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ

బాపట్ల టౌన్: నేరాల నియంత్రణకు డ్రోన్లతో నిఘా కీలకమైందని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. జిల్లాలోని ఆరు పోలీస్‌స్టేషన్లకు ఆయా స్టేషన్ల పరిధిలోని దాతలు డ్రోన్లను అందించారు. బుధవారం దాతలను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాల కట్టడి, నేరాల నియంత్రణలో డ్రోన్ల ద్వారా నిఘా కీలకమన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 6 డ్రోన్లను దాతలు అందించడం అభినందనీయం అన్నారు. డీజేఐ మినీ–3 డ్రోన్లను జిల్లా పోలీస్ శాఖకు అందించారన్నారు. నిజాంపట్నం పోలీస్‌స్టేషనుకు రాఘవేంద్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తరపున కావలి ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటకృష్ణారెడ్డి ఒకటి, నిజాంపట్నంలోని ఏబీఏడీ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్, బ్లూ పెర్ల్ మెరైన్ కంపెనీలు సంయుక్తంగా మరో డ్రోన్ అందించాయి. రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్‌కు డి.పి.ఎస్. ఫుడ్స్ తరపున ఒకటి, భట్టిప్రోలు పోలీసు స్టేషనుకు కొల్లూరు మండలం జువ్వలపాలెం చెందిన వేములపల్లి రవికిరణ్ ఒకటి, చెరుకుపల్లి పోలీస్ స్టేషనుకు మండలంలోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ ఒకటి, వేమూరు పోలీస్ స్టేషనుకు హైదరాబాద్‌కు చెందిన యోషిత హౌసింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ఒక డ్రోన్ బహూకరించినట్లు తెలిపారు. అనంతరం దాతలను సన్మానించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ ఎ. శ్రీనివాస రావు, రేపల్లె టౌన్ సీఐ మల్లికార్జున రావు, రేపల్లె రూరల్ సీఐ సురేష్ బాబు, వేమూరు సీఐ ఆంజనేయులు, నిజాంపట్నం, భట్టిప్రోలు, వేమూరు, చెరుకుపల్లి ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్

బాపట్ల: మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ 2.0 జిల్లా స్థాయి కార్యక్రమం కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం పాఠశాలలోనే జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వారధిపై అలుముకున్న అంధకారం

- నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు
- విద్యుద్దీపాలు వెలగకపోవటంతో తరచూ ప్రమాదాలు



విద్యుత్ దీపాలు లేక పెనుమూడి - పులిగడ్డ వారధిపై అలుముకున్న చీకటి



వారధిపై జరిగిన ప్రమాదం (ఫైల్)

రేపల్లె: పెనుమూడి – పులిగడ్డ వారధి అంధకారంలో మగ్గిపోతోంది. ఉమ్మడి కృష్ణా – గుంటూరు జిల్లాలను కలుపుతూ కృష్ణానదిపై అనుసంధానంగా ఉన్న ఈ వారధి రాష్ట్రంలో రెండో అతి పెద్దదిగా చెప్పుకోవచ్చు. ఇక్కడ వీధి దీపాలు మరమ్మతులకు గురవ్వటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ వంతెనపై రాత్రి వేళ ప్రయాణం చేయడం కత్తిమీద సాములా మారింది. రోజూ వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, బస్సులు ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. పులిగడ్డ – పెనుమూడి మధ్య ప్రయాణించాల్సిన వారికిదే ప్రధాన మార్గం.

తరచూ ప్రమాదాలు

ఇటీవల రేపల్లె మండలం ఆరవపల్లికి చెందిన కుటుంబం మచిలీపట్నం బీచ్‌కి వెళ్లి వస్తుండగా రాత్రి సమయంలో వారధిపై జరిగిన ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అదేవిధంగా తెనాలికి చెందిన కుటుంబం మోపిదేవి గుడికి కారులో వెళ్తూ ఉండగా వారధిపై జరిగిన ప్రమాదంలో వారిలోని ముగ్గురు చనిపోయారు. రుద్రవరానికి చెందిన యువకుడు, పేటేరుకు చెందిన యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదం గురై మృత్యువాత పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో పాత దీప స్తంభాలు ఉన్నా కరెంట్ సరఫరా లేదు. ఈ వంతెనపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడమే కాకుండా, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

పెనుమూడి – పులిగడ్డ వారధిపై లైటింగ్ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రాత్రి సమయంలో లైటింగ్ లేకపోవడం వల్ల జరుగుతున్న ప్రమాదాలను వివరించి, సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తాం.

– శ్రీనివాసరావు, తహసీల్దార్

శరణు శాకంబరి





సారెతో అమ్మవారి సన్నిధికి వచ్చిన భక్త బృందం

- రెండో రోజు పోటెత్తిన భక్తజనం
- హరితమయంగా ఇంద్రకీలాద్రి
- నేడు పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శాకంబరి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో రెండో రోజైన బుధవారం పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని శాకంబరిగా దర్శించుకున్నారు. మరో వైపున ఆషాఢ మాసోత్సవాలు కొనసాగుతుండగా.. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి పలు భక్త బృందాలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించాయి. సుమారు 50కిపైగా భక్త బృందాలు అమ్మవారికి సారెను సమర్పించాయి. శాకంబరి ఉత్సవాలకు గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని రైతుల నుంచి సుమారు 25 టన్నులకు పైగా కూరగాయలు, ఆకుకూరలను సేకరించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. శాకంబరిగా దుర్గమ్మను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. కనకదుర్గనగర్, మహామండపం మీదుగా కొండపైకి చేరుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు దేవస్థానం కదంబ ప్రసాదం పంపిణీ చేసింది. ఆలయ ప్రాంగణంలో చేసిన అలంకారం నుంచి ఒక్క కూరగాయ, ఆకుకూరనైనా ఇంటికి తీసుకువెళ్లాలనే భావనతో భక్తులు కూరగాయల కోసం ఎగబడటం కనిపించింది.

చివరి రోజైన గురువారం అమ్మవారిని పండ్లు, ఫలాలు, డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించనున్నారు. ఇందు కోసం యాలకులు, జీడిపప్పులతో దండలను సిద్ధం చేస్తున్నారు. యాగశాలలో మహా పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయి.

నేడు గిరి ప్రదక్షిణ

ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ గురువారం ఉదయం 5.55 గంటలకు ప్రారంభమవుతుందని ఆలయ ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న రథంతో పాటు దేవస్థాన ప్రచార రథంతో గిరి ప్రదక్షిణ ప్రారంభం అవుతుందన్నారు. సుమారు 8 కిలోమీటర్ల మేర సాగే గిరి ప్రదక్షిణలో భక్తులు అందరూ పాల్గొనాలని దుర్గ గుడి అధికారులు కోరారు.

క్లుప్తంగా

వాహనం ఢీ.. ఒకరు మృతి



మేదరమెట్ల: తుఫాన్ వాహనం మోటారు బైక్‌ను ఢీ కొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందారు. కొరిశపాడు మండల పరిధిలోని వెంకటాపురం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం అర్ధ రాత్రి సమయంలో ఈ సంఘటన జరిగింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఒకరు దుర్మరణం చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. రేణింగవరం గ్రామానికి చెందిన మోషే (37), అదే గ్రామానికి చెందిన సంతోష్‌తో కలిసి మోటారు బైక్‌పై మేదరమెట్ల వచ్చి తిరిగి స్వగ్రామం వెళుతున్నారు. ఈ క్రమంలో బైకు వెంకటాపురం క్రాస్‌రోడ్డు వద్దకు వెళ్లగానే వెనుక నుంచి వచ్చిన తుఫాన్ వాహనం బైక్‌ను బలంగా ఢీ కొంది. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న మోషే రోడ్డుపై పడిపోగా తలకు తీవ్రగాయమై.. అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో వ్యక్తి సంతోష్‌కు రక్తగాయాలయ్యాయి. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భార్య హంతకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య



బొల్లాపల్లి: అనుమానం పెనుభూతమై అర్ధాంగిని కడతేర్చిన భర్త అదే గ్రామ పొలాల్లో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం జరిగింది. భార్యాభర్తల మృతితో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. బండ్లమోటు ఎస్‌ఐ ఏ. బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్ల వాగు గ్రామ పొలాల్లో గంగనబోయిన వెంకటేశ్వర్లు (37) చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడు రోజుల కిందట ఇదే పొలాల్లో భార్య కృష్ణకుమారిని హత్య చేసి పరారీలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో భార్యను హత్య చేసిన ప్రదేశానికి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకున్నాడు. పొలానికి వచ్చిన గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన ప్రాంతానికి వారు చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడు తమ్ముడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

సీఐటీయు జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె: కార్మిక లోకానికి నష్టం చేకూర్చే లేబర్‌కోడ్‌లను ప్రభుత్వాలు వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం రేపల్లె పట్టణంలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, రైస్ మిల్ ముఠా, సివిల్ సప్లయర్స్ ముఠా, ఆశ వర్కర్లు, ఆటో డ్రైవర్లు, సుమో డ్రైవర్లు, ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు, బజార్ ముఠా వర్కర్లు, మున్సిపల్ ఇంజినీరింగ్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు. మణిలాల్ మాట్లాడుతూ దేశంలో కార్మికవర్గం కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఉమ్మడిగా తిప్పికొట్టాలని కోరారు. జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ప్రైవేటీకరణ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని పేర్కొన్నారు. కార్మికులకు కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ధరల పెరుగుదలకు పరిహారంతో పాటు ఐదేళ్ల ఒకసారి కనీస వేతనాల సవరణ చేయాలని కోరారు. కేంద్రంలో 8వ వేతన సంఘాన్ని, రాష్ట్రంలో 12వ వేతన సంఘాన్ని నియమించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శామ్యూల్ మాట్లాడుతు కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం మాత్రమే అమలు చేయాలన్నారు. బిల్డింగ్ వెల్ఫేర్ లేబర్ బోర్డు పునరుద్ధరించాలన్నారు. కార్మిక చట్టాలను తనిఖీ చేసే లేబర్ అధికారుల విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. తొలుత వివిధ కార్మిక సంఘాల కార్మికులు బస్టాండ్ సెంటరులో మానవహారంగా ఏర్పడి ప్రభుత్వంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రింగు రోడ్డు వరకు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్టీయూ, రైతు కూలీ సంఘాలతో పాటు పలు కార్మిక సంఘాల నాయకులు ర్యాలీగా భారీ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఎం.శోభారాణి, నాయకులు కె.ఝూన్సీ సి.వాణిశ్రీ, పి.బిక్షాలు, ఎం.ఈశ్వర రావు, టి.బుజ్జి, పి.విజయ్, రాఘవ, కె.ఆశీర్వాదం, కె.రమేష్, జి.వెంకటేశ్వరరావు, కె.మాణిక్యరావు, ఎం.సాయి, కాలేశా పాల్గొన్నారు.



రేపల్లె బస్టాండ్ సెంటరులో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు



రేపల్లెలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

నేటి నుంచి టౌన్‌చర్చి శతవార్షికోత్సవాలు

ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ప్యారిష్ పాస్టర్ రెవ.దేవరపల్లి ఏసురత్నం

తెనాలి: పట్టణంలో టౌన్‌చార్చిగా పిలుచుకునే ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ చర్చి(తూర్పు గుంటూరు సినడ్) క్రీస్తు దేవాలయం శతవార్షిక మహోత్సవాలు గురువారం నుంచి వైభవంగా ఆరంభం కానున్నాయి. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రిక, బ్రోచర్‌ను బుధవారం టౌన్‌చర్చిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్యారిష్ పాస్టర్ రెవరెండ్ దేవరపల్లి ఏసురత్నం, అడిషనల్ పాస్టర్లు రెవరెండ్ వై.లెనిన్‌బాబు, రెవరెండ్ డి.సాల్మన్‌రాజు, రెవరెండ్ ఎంవీబీ ప్రకాష్‌బాబు అడ్‌హాక్ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. 10,11,12 తేదీల్లో ఉదయం ప్రార్థన, ఆరాధనలు, సాయంత్రం చర్చి వెలుపల వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. గౌరవ అతిథులుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఏఈఎల్ చర్చి కంట్రోలర్ జస్టిస్ కురియన్ జోసెఫ్, కేరళకు చెందిన మాజీ జడ్జి జోసెఫ్ పీఎస్, ఆంధ్రప్రదేశ్ మాజీ జూనియర్ జడ్జి ఎన్.జేసు రత్నకుమార్ హాజరవుతారని తెలిపారు.



ఆవిష్కరణలో రెవ.ఏసురత్నం, లెనిన్‌బాబు

- రెవ.వై.లెనిన్‌బాబు మాట్లాడుతూ హాఫ్‌దోర టౌన్ చర్చిని కట్టించి విద్యాలయం, వైద్యశాలను నిర్మించి ప్రజలకు సేవలందించినట్టు తెలిపారు. మూడురోజుల ఉత్సవాలకు ప్రజలు హాజరై దేవుని మన్ననలు పొందాలని అడిషనల్ పాస్టర్లు రెవ.డి.సాల్మన్‌రాజు, రెవ.ఎంవీబీ ప్రకాష్‌బాబు కోరారు. శతవార్షిక మహోత్సవాల్లో భాగంగా 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి సెయింట్‌జాన్స్ విద్యాసంస్థ పక్కన ఉన్న లూథరన్ యూపీ స్కూలు ప్రాంగణంలో ప్రేమ విందు ఉంటుందని అడ్‌హాక్ కమిటీ సభ్యుడు జి.వేమయ్య చెప్పారు.

ఇండోర్ ఆడిటోరియం స్టేడియం ప్రారంభం

సత్తెనపల్లి: సత్తెనపల్లిలో ఇండోర్ ఆడిటోరియం స్టేడియాన్ని బుధవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరావతి ప్రాంతంలో సుమారు 50 వేల ఎకరాలు అభివృద్ధి చేసి దానిలో 2,500 ఎకరాలు అంతర్జాతీయ క్రీడా మైదానానికి కేటాయిస్తానని చంద్రబాబు చెప్పారని గుర్తు చేశారు. తొలుత స్టేడియాన్ని ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. స్టేడియానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్, గ్రౌండ్, ప్రహరీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వాటికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వినతి పత్రం అందించారు. నూతనంగా ప్రారంభించిన కోర్టులో బ్యాడ్మింటన్ ఆడారు.

బాలలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి

బాపట్ల: బాలలకు చదువుకునే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సూచించారు. బాపట్ల జిల్లాలోని కర్లపాలెం మండలంలో బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గణపవరం జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో విద్యార్థులతో పనులు చేయించటాన్ని గమనించి ఆమె ప్రధానోపాధ్యాయలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులను, హాజరు పటికను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వంటకాలను రుచి చూశారు. బాలల సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు 1098 నంబరును ప్రతి చోట రాయించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ప్రతి పాఠశాలలో తప్పని సరిగా ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని కోరారు. బాల బాలికలకు వారి హక్కులకు భంగం కలిగిస్తే బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. బాపట్లలోని బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో చారులత, డీసీపీఓ పురుషోత్తమరావు, కర్లపాలెం ఎంఈఓ మనోరంజనీ పాల్గొన్నారు.



కర్లపాలెం పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న పద్మావతి

భూవివాదంపై కేసు నమోదు

చీరాల: కోర్టు ఆదేశాల మేరకు అసైండ్ భూమి వివాదంపై ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఈపూరుపాలెం ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. పేరాలకు చెందిన తెలగతోటి కిషోర్‌కు ప్రభుత్వం గతంలో తోటవారిపాలెం పరిధిలో కొంత భూమిని ఇచ్చింది. గత ఏడాది అక్టోబర్ 24న కిషోర్ బాబు తన స్థలానికి కొలచేందుకు సర్వేయర్లను తీసుకెళ్లగా ఉప్పాల చంద్రశేఖర్, మరికొందరు అడ్డుకున్నారు. ఈ భూమిని తాము 2012లో కొనుగోలు చేశామని వాదించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో కిషోర్ బాబు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కొలతలు అడ్డుకున్న వారిపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'కూటమి' దెబ్బకు రైతు కుదేలు

- ఆర్థిక సాయం అందివ్వని ప్రభుత్వం
- ఖరీఫ్ పెట్టుబడికి తప్పని పాట్లు
- నగదు లేక కష్టపడుతున్న అన్నదాతలు

సత్తెనపల్లి: రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతున్నారు. దుక్కులు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. సాగుకు సంబంధించిన పెట్టుబడి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గతంలో రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. రైతుకు రూ. 13,500 చొప్పున రైతు భరోసా మంజూరు చేయడంతో కొంత లబ్ధి చేకూరింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా కంటే అదనంగా కొంత చేర్చి రైతుకు రూ.20 వేలు అన్నదాత సుఖీభవ కింద అందిస్తామని టీడీపీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది.

నిధులు విడుదలవుతాయా?

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఏటా రూ. 20 వేలు అందిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఏడాదైనా ఇంతవరకు పైసా కూడా ఇవ్వలేదు. రైతుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుండటంతో ప్రస్తుతం గ్రామాల్లో ఈ పథకానికి సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియ చేపట్టారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లబ్ధి పొందడానికి సమీప రైతు సేవా కేంద్రాలకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేదెన్నడో... అర్హులను గుర్తించి నిధులు విడుదల చేసేదెప్పుడో.. అని రైతులు తలలు పట్టుకుంటున్నారు.



భారంగా మారిన సాగు

విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు ఏటికేడు పెరుగుతున్నాయి. దుక్కి, కూలీల ఖర్చులు కూడా అమాంతం పెరిగాయి. వీటన్నింటిని దాటి పంటలను సాగు చేయాలంటే తగిన దిగుబడి చేతికి వస్తుందన్న ఆశ కూడా పూర్తిగా లేదు. వాతావరణ పరిస్థితుల కారణంగా గతంలో కంటే తక్కువగా పంటలు సాగు చేస్తున్నారు.రైతులకు కూటమి ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం, పంట నష్టపోతే బీమా పరంగా అండ లభించడం లేదు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం గురించి కనీసం పట్టించుకోవట్లేదనే విమర్శలు వస్తున్నాయి.

జిల్లాలవారీగా పరిస్థితి ఇదీ...

జిల్లా	అర్హులైన రైతులు	ఈకేవైసీ పూర్తి	ఈకేవైసీ పెండింగ్
గుంటూరు	1,07,942	1,02,731	5,211
పల్నాడు	2,39,110	2,31,495	7,615
బాపట్ల	1,59,157	1,52,842	6,315

గుంటూరు జిల్లా రెడ్‌క్రాస్‌కు పతకాలు

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక సేవా విభాగంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గుంటూరు జిల్లా రెడ్‌క్రాస్‌కు గవర్నర్ పురస్కారాలు లభించాయి. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన రెడ్‌క్రాస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో భాగంగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ గుంటూరు జిల్లా చైర్మన్ డాక్టర్ వడ్లమాని రవి, వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు అవార్డులను అందుకున్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి, 2023–24 ఆర్థిక సంవత్సరానికి తృతీయ ఉత్తమ జిల్లాగా గుంటూరు రెడ్‌క్రాస్‌కు అవార్డులు వరించాయి.




గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వడ్లమాని రవి, రామచంద్రరాజు

వైకుంఠపుర వాసుని ఆదాయం రూ.46.76 లక్షలు

తెనాలిరూరల్: స్థానిక వైకుంఠపురంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ టి.సుభద్ర, దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.అనుపమ నేతృత్వంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. 113 రోజుల అనంతరం లెక్కింపు జరిపారు. పట్టణానికి చెందిన పలువురు భక్తులు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు, మహిళలు స్వచ్ఛందంగా లెక్కింపు సేవలో పాల్గొన్నారు. దేవస్థానంలోని హుండీ లెక్కింపు ద్వారా రూ.46,76,204 నగదు స్వామి వారికి సమకూరింది. అలానే 19.50 గ్రాముల బంగారం, 319 గ్రాముల వెండిని భక్తులు స్వామి వారికి సమర్పించారు. అలానే రద్దయిన పాత రూ. వెయ్యి నోట్లు ఆరు, రూ. 500 నోట్లు పది గుర్తు తెలియని భక్తులు హుండీలో వేశారు. లెక్కింపులో భక్తులు, వలంటీర్లు, చెంచుపేట ఆప్కాబ్ బ్యాంక్ సిబ్బంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.



సమన్వయంతో సైబర్ నేరాలకు చెక్



నగరంపాలెం: పోలీస్ శాఖ, బ్యాంక్‌లు సమన్వయంతో సైబర్ నేరాలను అరికడదామని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో బుధవారం జిల్లాలోని బ్యాంక్‌ల మేనేజర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న దృష్ట్యా సైబర్ మోసాలు గణనీయంగా పెరిగాయన్నారు. ఈ క్రమంలో జిల్లాలోని ప్రజలు, ఖాతాదారులకు ముందస్తు సమాచారం, అవగాహన కల్పిద్దామన్నారు. వినియోగదారులు పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే బాధితులకు ఎఫ్‌ఐఆర్ లేకుండా సహాయమందుతుందని చెప్పారు. ఖాతాదారులు ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి నగదు లావాదేవీలు నిర్వర్తించే వేళల్లో బ్యాంక్‌లను సంప్రదించి నిజనిజాలను పరిశీలించాలని పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలు, లోన్ యాప్ మోసాలపై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఖాతాదారులకు, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), కె.సుప్రజ (క్రైం), యూనియన్ బ్యాంక్ డీజీఎం జవహర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి, బ్యాంక్‌ల మేనేజర్లు పాల్గొన్నారు.

న్యాయవాదిపై మరో న్యాయవాది దాడి

- సివిల్ వ్యవహారంలో డబ్బుల దగ్గర వివాదం
- ఇద్దరు న్యాయవాదులు కూటమి నేతలే..
- వినుకొండలో తీవ్ర చర్చనీయాంశం

వినుకొండ: సీనియర్ న్యాయవాదిపై మరో సీనియర్ న్యాయవాది దాడి చేసి, నానా దుర్భాషలాడిన ఘటన వినుకొండ పట్టణంలో న్యాయస్థానం ముందు చోటు చేసుకుంది. వివరాలు.. వినుకొండ మండలం వెంకుపాలెం పరిధిలోని భూమికి సంబంధించి సివిల్ దావా ఒకటి వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నడుస్తోంది. అయితే, పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఆ దావాను కొంత కాలం నుంచి తన క్లయింట్ తరఫున వాదిస్తూ వచ్చాడు. తనకు ఆ కేసును ఇచ్చినట్లయితే రాజీ చేసి, ప్రతిఫలం ముట్టచెబుతా అని మరో సీనియర్ న్యాయవాది దావాను చేజిక్కించుకున్నాడు. అదేమని అడిగితే కోర్టు గేటు ముందే దాడి చేశాడు. న్యాయవాదులు ఇద్దరూ కూటమికి చెందిన వారే కావడం విశేషం. ఈ గొడవ బయటకు పొక్కడంతో పట్టణ ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. న్యాయవాదులు సివిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని కూటమి ప్రభుత్వం పరువు తీస్తున్నారని ఆ పార్టీలో కూడా చర్చ జరగడం విశేషం. ఇంత జరిగినా దాడిపై న్యాయవాది ఫిర్యాదు చేయలేదు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకట్రావు

పిడుగురాళ్ల రూరల్: మిరప నారు పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ. వెంకట్రావు సూచించారు. కామేపల్లి రైతు భరోసా కేంద్రంలో బుధవారం సమగ్ర ఉద్యాన మిషన్ ఆధ్వర్యంలో మిరప నారు పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ. వెంకట్రావు, డాట్ సెంటర్ అధికారి డాక్టర్ నగేష్ హాజరయ్యారు. ముందుగా కామేపల్లిలో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్రావు నర్సరీ చట్టం– 2010 గురించి యజమానులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. జిల్లా డాట్ సెంటర్ అధికారి డాక్టర్ నగేష్ మిరప నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తన శుద్ధి, సస్యరక్షణ, విత్తే సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కో– ఆర్డినేటర్ మస్తాన్‌వలి, ఉద్యాన శాఖ అధికారి కుమారి అంజిలిబాయి, గ్రామీణ ఉద్యాన శాఖ అధికారులు కరిముల్లా, దస్తగిరి పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రంలో మాట్లాడుతున్న వెంకట్రావు

ద్విచక్రవాహనం మాయం

దగ్గుబాడు(కారంచేడు): ఇంటి బయట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం తెల్లవారేసరికి మాయం అయిన ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు షేక్ అప్సనా తెలిపిన వివరాలు.. ముస్లిం కాలనీలోని ఉర్దూ పాఠశాల సమీపంలో మంగళవారం రాత్రి బ్లాక్ యూనికాన్ వాహనం ఎప్పటిలాగానే ఇంటి బయట పార్క్ చేసి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఇంటి బయటకు వచ్చి చూస్తే అప్పటికే బైక్ లేదు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. గత ఏడాది కూడా ఇదే కుటుంబానికి చెందిన మరో వాహనం కూడా చోరీకి గురైనట్లు చెబుతున్నారు.